క్లుప్తంగా

నీలగిరిని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

నల్లగొండ క్రైం: నీలగిరిని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ సీఐ డానియెల్ కోరారు. ఆదివారం నంబర్ ప్లేట్లు లేని, మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న 6 కార్లు, 2ఆటోలు, 44 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై 54 కేసులు నమోదు చేశామని తెలిపారు. అనంతరం వాహనదారులకు కౌన్సిలింగ్ చేశారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా యాదగిరి



మర్రిగూడ: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గ్యార యాదగిరి ఆదివారం నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక మునికుమార్ నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు పెరిక మునికుమార్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డికి యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు.

రేపటి నుంచి 'హర్‌ఘర్ తిరంగా'

కేతేపల్లి: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు తాడోజు నర్సింహాచారి పిలుపునిచ్చారు. ఆదివారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయాలన్నారు. బీజేపీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు.

కనగల్‌లో...



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కనగల్: హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం కనగల్ ఎక్స్‌రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహాన్ని నీళ్లతో శుద్ధి చేసి, పూలమాల వేసారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు పులకరం భిక్షం, నాయకులు దాసరి వెంకన్న, మాదగోని ఏడుకొండలు, పంతంగి సైదులు, మారగోని సురేష్, సముద్రాల రమేష్, పలగోని సైదులు, చనగోని యాదగిరి, చనగోని లింగయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న శేఖర్

మునుగోడు: మండలంలోని గుండ్లోరిగూడేనికి చెందిన ఈర్ల నర్సమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వట్టికోటి శేఖర్ రూ.5వేల నగదుతోపాటు క్వింటా బియ్యాని అందజేశాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, నాయకులు జంగిలి నాగరాజు, జాజుల వెంకటేష్, ఆవుల శ్రీను, కట్లకుంట్ల మహేష్, బొల్లం మారేష్, జంగిలి పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత వాతావరణం



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి: ఆధ్యాత్మికతతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు.ఆదివారం మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో కంత మహేశ్వరస్వామి కల్యాణ వేడుకల్లో ఆయన పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోలి మంజులవేణుమాధవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్ రెడ్డి, నాయకులు బంటు మహేందర్, కానుగు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తూచ్!

- ఇరుకు రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాల నిలుపుదల
- నకిరేకల్‌లో తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, దుకాణదారులు



నకిరేకల్ పట్టణంలోని తిప్పర్తి రోడ్డులో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

నకిరేకల్ : నకిరేకల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకీ జఠిలమవుతోంది. వాహనదారులు నిబంధనలు పాటించకుండా ఇరుకురోడ్లపై వాహనాలను నిలుపుతుండడం సమస్యకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. తిప్పర్తి, మూసీ, మెయిన్ రోడ్డుతోపాటు పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న శివాజీనగర్‌కు వెళ్లే దారుల్లో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

దుకాణాల ఎదుట వాహనాల పార్కింగ్

40వేల పైచిలుకు జనాభా కలిగిన నకిరేకల్ పట్టణానికి సమీప మండలాల నుంచి మరో 20వేల మంది వివిధ అవసరాల నిమిత్తం ఇక్కడికి వస్తుంటారు. వ్యాపార, విద్యాపరంగా ముఖ్య కూడలి అయిన నకిరేకల్‌కు శాలిగౌరారం, కట్టంగూర్, కేతేపల్లి, తిప్పర్తి మండలాల ప్రజలతో పాటు మోత్కూరు మండలం నుంచి కూడా ప్రజానీకం వస్తుంటారు. ఈ మండలాల నుంచి చదువుకునే విద్యార్థులు కూడా ఇక్కడికే వస్తారు. పట్టణంలోని ఇందిరా గాంధీ సెంటర్ నుంచి బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు సాగించడంతో గందరగోళ పరిస్థితి నెలకొంటుంది. మరో వైపు మెయిన్ సెంటర్‌లో ఆటోలు, ఇతర వాహనాలు అడ్డదిడ్డంగా ఆపడంతో ట్రాఫిక్ సమస్య అధికమవుతోంది. షాపుల ముందు ద్విచక్రవాహనాలు, ఆటోలు నిలుపుతుండడంతో ప్రజలు రాలేకపోతున్నారని దుకాణదారులు వాపోతున్నారు. మరోవైపు రహదారులపై తోపుడుబండ్ల వ్యాపారులతో కూడా ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతోంది.

శివాజీనగర్‌కు వెళ్లే దారిలో..

మెయిన్ సెంటర్‌లోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న దుకాణాల ముందు, రహదారి వరకు నిత్యం బైక్‌లు నిలిచి ఉంటాయి. శివాజీనగర్‌కు వెళ్లే దారిలో ఎస్‌బీఐ బ్యాంక్ ఉంది. ఈ దారిలో కూడా అదే పరిస్థితి.ఈ దారి నుంచి శివాజీ నగర్‌కు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



శివాజీనగర్‌కు వెళ్లే దారిలో వాహనాల పార్కింగ్

ఇబ్బంది పడుతున్నాం..



ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లేవారు ద్విచక్రవాహనాలు తమ దుకాణ ఎదుట పెట్టి వెళ్లిపోతున్నారు. కొందరు ఉదయం పెట్టి రాత్రి తీసుకువెళ్తున్నారు. ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు దరఖాస్తులు పెట్టినా ఫలితం ఉండటం లేదు.

– శ్రీమన్నారాయణ, కిరాణ దుకాణదారుడు, నకిరేకల్

శివన్నగూడ రిజర్వాయర్‌ను పూర్తి చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

మర్రిగూడ: మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు, తాగునీటిని అందించే డిండి ఎత్తిపోతల పథకాన్ని, దాని కింద ఉన్న శివన్న గూడ రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సీపీఐ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బంగారం లాంటి భూములున్నా సాగునీరు లేక మునుగోడు, దేవరకొండ ప్రాంత ప్రజలు వలసెల్లిపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, రేషన్‌కార్డులను అర్హులకు అందించాలని కోరారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు, నాయకులు బుర్ర శేఖర్, ఆకుల రఘుమయ్య, ఎరుకుల నిరంజన్, కల్యాణ్, యాదగిరిరెడ్డి, కొండ్రెడ్డి గిరి, ఇస్కిళ్ల మహేందర్, ఆకుల వెంకట్రామ్, హరి, అంజయ్య, మల్లేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం ప్రైవేటు సంస్థలకు ఇవ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న పెంజర్ల సైదులు

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ప్రైవేట్ సంస్థలకు ఇవ్వొద్దని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు అన్నారు. ఆదివారం కట్టంగూర్‌లో మాధ్యాహ్న భోజన కార్మికుల మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న రేట్లకు అనుగుణంగా మెనూ రేట్లు పెంచాలన్నారు. కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు.కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21న చేపట్టే చలో హైదరాబాదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మధ్యాహన్న భోజన కార్మికుల మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాచర్ల యాదమ్మ, కంకణాల శోభారాణి, కొప్పు మంగమ్మ, మాతంగి లక్ష్మమ్మ, రేణుక, విజయమ్మ, ప్రవీల, నరసమ్మ ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ : విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని మాన్యంచెల్క బహదూర్ ఖాన్ కమ్యూనిటీ హాల్లో ఉర్దూ మీడియం స్కూల్ పేద విద్యార్థులకు ఆయన ఉచితంగా నోటు పుస్తకాలు అందజేసి మాట్లాడారు. కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ట్రస్టు ద్వారా బహదూర్‌ఖాన్ ఆధ్వర్యంలో తక్కువ ఫీజులతో స్కూల్ స్థాపించడానికి మంత్రి కోమటిరెడ్డితో చర్చించి ప్రభుత్వ స్థలం వచ్చే విధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొహ్మద్ రూహేద్ హుస్సేన్, ముంతాజ్ ఖురేషి, మొహమ్మద్ కలీం, షఫీ నవాస్ ఖాన్, షాహిద్ అహ్మద్, మౌజామ్ హుస్సేన్, ఎంఎం వాసిక్, నుసురత్ ఖాన్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



నకిరేకల్: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



కనగల్ : చెక్కులు అందజేస్తున్న గడ్డం అనూప్‌రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్

నకిరేకల్ : చిట్యాల, నార్కట్‌పల్లి మండలాలకు చెందిన 213 మంది లబ్ధిదారులకు రూ.64.11 లక్షల విలువైన చెక్కులను తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, నాయకులు బత్తుల ఉశయ్య, గుడిపాటి లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

కనగల్ : సీఎం సహాయ నిధి పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం వారు కనగల్ మండల కేంద్రానికి చెందిన 8మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నర్సింగ్ సునీత కృష్ణయ్య గౌడ్, గోగు యాదయ్య యాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి హఫీజ్, పీఏసీఎస్ డైరెక్టర్లు పోచమల్ల వెంకన్న, నరసింహ, రాయల శ్రవణ్, పందుల రాజా, బచ్చగోని నరేందర్ పాల్గొన్నారు.

చండూరు : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన ఓర్సు గోపాల్‌కు ఇటీవల సీఎం సహాయనిధి చెక్కు మంజూరైంది. ఆ చెక్కును ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్ ఆదివారం ఆ గ్రామంలో బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గాదె సత్తయ్య, అయితగోని భిక్షమయ్య, రాంబాబు పాల్గొన్నారు.

15న ఖమ్మంలో కాంగ్రెస్ రైతు సభ



మాట్లాడుతున్న అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి

కేతేపల్లి: ఖమ్మం పట్టణంలో ఈ నెల 15న నిర్వహిస్తున్న కాంగ్రెస్ రైతుసభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ ఒకే దఫాలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సభకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క హాజరువుతున్న సమావేశానికి రైతులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో డీసీసీ నాయకులు జటంగి వెంకటనర్సయ్యయాదవ్, కాంగ్రెస్ నాయకులు అలుగుబెల్లి జోగిరెడ్డి, బీరం జాన్‌రెడ్డి, ఎ.నాగయ్య, బయ్య ముత్తయ్య పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బకరం శ్రీనివాస్

నల్లగొండ టౌన్: ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన మంద కృష్ణ మాదిగ ఈ నెల 13న హైదరాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెరిగి శ్రీశైలం, ఎంఈఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు గాదె రమేష్, లంకపల్లి నరేష్, రమణ భార్గవ్, గట్టు మల్లయ్య, కందుల మోహన్, దేవయ్య, కత్తుల సందీప్, బొజ్జ దేవయ్య, నాగరాజు, రఘువీర్, పరమేష్, స్వామి ఉన్నారు.

ఘన స్వాగతం పలకాలి

మర్రిగూడ: ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ ఈనెల 13న హైదరాబాద్‌కు వస్తున్నందున మాదిగలు అధిక సంఖ్యలో హాజరై ఆయనకు ఘన స్వాగతం పలకాలని సంఘం రాష్ట్ర నాయకుడు జిల్లా తిరుమలేష్ ఆదివారం కోరారు.

మూఢనమ్మకాలను ప్రజలు విశ్వసించొద్దు

మిర్యాలగూడ టౌన్ : మూఢనమ్మకాలను ఎవరూ విశ్వసించొద్దని జేవీవీ ప్రతినిధి కోలా శ్రీనివాస్, పాదూరి రమణారెడ్డి, సైన్స్ ప్రచార సంస్థ కన్వీనర్ బక్క శ్రీనివాస్‌చారి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న వేప చెట్టు కింద కొన్ని మంత్రించిన కొబ్బరి కాయలు అమవాస్య రోజు పెట్టారని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంస్థ ప్రతినిధి సంఘటన స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ఆ సంస్థల ప్రతినిధులు అమావాస్య రోజున పగులకొట్టిన కొబ్బరి కాయలను తిని ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వేదికపై మర్రిగూడ మండలం శివన్నగూడ జెడ్పీ హైస్కూల్ 2005-06 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తిప్పర్తి : అనుమతులు లేకుండా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం తిప్పర్తి పోలీసులు పట్టుకున్నారు. తిప్పర్తి మండలం పెద్దసూరారం గ్రామానికి చెందిన జి.వెంకన్న డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వెంకన్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అశోక్ లీలాండ్ వాహనంలో లోడ్ చేసుకుని నల్లగొండ వైపునకు బయలుదేరాడు. పక్కా సమాచారంతో పోలీసులు అతడిని పెద్దసూరారం సమీపంలో పట్టుకుని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వెంకన్న, వాహన యజమాని రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఎస్ఐ రాజు తెలిపారు.

బెల్టు దుకాణాలు మూసివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లింగయ్య

మునుగోడు: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు బెల్టు దుకాణాలు పూర్తిగా మూసివేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బూడిద లింగయ్య యాదవ్ కోరారు. ఆదివారం మండలంలోని ఇప్పర్తిలో గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసుకొని బెల్టు దుకాణాల మూసివేతపై చర్చించారు. అనంతరం బెల్టు దుకాణాల నిషేధిత కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యుల సూచనలు గ్రామస్తులు విధిగా పాటించాలని తీర్మానం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

హాలియా : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని హాలియా ఉన్నత పాఠశాల కో ఆర్డినేటర్ గుండా కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్‌లో చేరే విద్యార్థులు ఈనెల 8వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు అడ్మిషన్లు పొందాలన్నారు. ఓపెన్ టెన్త్ అడ్మిషన్ల కోసం ప్రవేశం పొందే విద్యార్థులు రికార్డు షీట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో ,ఇంటర్ కోర్సుల్లో చేరే విద్యార్థులు పదో తరగతి పాస్ మెమో, టీసీ, కులధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫొటో జతచేయాలన్నారు. వివరాలకు 9010750686 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బోనమెత్తిన పల్లెలు



శాలిగౌరారం మండలం మాదారంకలాన్‌లో బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు



తిప్పర్తి మండలం సిలార్‌మియాగూడలో బోనాలతో మహిళలు



కేతేపల్లి మండలం కొత్తపేటలో బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

హాలియా : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుజాత ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అనుముల మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12న సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారాని కృషి చేయనున్నట్లు తెలిపారు.

మునుగోడులో భారీగా తగ్గిన వరిసాగు

- గత ఏడాదితో పోలిస్తే 5,500 ఎకరాల విస్తీర్ణం తగ్గుదల
- వర్షాలు కురవక అడుగంటిన భూగర్భజలాలు
- చుక్కనీరు లేక వెలవెలబోతున్న చెరువులు, కుంటలు
- సాగు చేసిన పంటలైనా చేతికి రావడం కష్టమేనంటున్న రైతులు



మునుగోడు : నారుమడికి సరిపోయేంత నీటినే పోస్తున్న బోరు

మునుగోడు : మునుగోడులో ప్రస్తుత వానాకాలంలో వరిసాగు గణనీయంగా పడిపోయింది. సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా ఇప్పటి వరకు సరైన వర్షాలు కురవకపోవడం.. భుగర్భజలాలు పాతాళానికి పడిపోవడంతో వరిసాగు విస్తీర్ణం తగ్గడానికి కారణమని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది అంతంత మాత్రంగానే కురిసిన వర్షాలకు మండలంలోని ఏ ఒక్క చెరువు, కుంటలు నిండలేదు. దీనికి తోడు 30 అడుగుల లోతు వరకు వేసిన బోర్లు సైతం పోయడం లేదని రైతులు వాపోతున్నారు.

4,500 ఎకరాల్లోనే..

వానాకాలం సీజన్ మొదలైయినప్పటి నుంచి భారీ వర్షాలు కురవకపోవడంతో రైతుల వ్యవసాయ బోర్లు అడుగంటి కేవలం నారు మడికి సరిపాను నీటిని మాత్రమే అందిస్తున్నాయి. దీంతో ప్రతి ఏటా 10 వేల ఎకరాలకు పైగా వరి సాగుచేసే రైతులు ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు 4,500ల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా ప్రధాన నీటి వనరైన మునుగోడు పెద్ద వాగు పారకపోవడంతో బోర్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన కొద్దిపాటి ఎకరాల పంటలైనా చేతికి రావడం కష్టమేనని రైతులు పేర్కొంటున్నారు.

ఎకరమే సాగు చేశా..



వరిసాగు చేసేందుకు నాకున్న రెండు ఎకరాలతో పాటు మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకున్నా. కానీ ఈ ఏడాది ఒక్కసారి కూడా భారీ వర్షం కురవకపోవడంతో బోరులో నీరు బాగా తగ్గిపాయింది. దీంతో చేసేది ఏమీలేక నాలుగు ఎకరాలకు నారుపోసి ఎకరం మాత్రమే నాటు వేశాను.

– శిరగమళ్ల వెంకన్న, రైతు, చీకటిమామిడి

తక్కువ విస్తీర్ణంలో సాగైంది



ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఇప్పటి వరకు భారీ వర్షం కురవకపోవడంతో బోర్లలో నీరు బాగా తగ్గిపాయింది. సీజన్‌లో ఇప్పటి వరకు 4,500ల ఎకరాల్లో మాత్రమే రైతులు వరి సాగు చేశారు. ప్రతి ఏటా మండలంలో ఉన్న దాదపు 12వేల మంది రైతులు 10వేల ఎకరాల్లో వరిసాగు చేసేవాళ్లు. కానీ బోర్లలో నీరు కేవలం నారుమడులకు మాత్రమే సరిపోతుండటంతో రైతులు నాటు వేయలేకపోతున్నారు.

– ఎస్. శ్రీనివాస్‌గౌడ్, ఏఓ, మునుగోడు